క్లుప్తంగా

రేపు పులిమేరులో అయ్యప్ప పడిపూజ

పెద్దాపురం: మండలంలోని పులిమేరు రామాలయం వద్ద ఈ నెల 20వ తేదీన అయ్యప్ప పడిపూజ నిర్వహించనున్నట్లు గురుస్వాములు తుమ్మల బుల్లియ్య, దొడ్డిపట్ల సూర్య నాగేశ్వరరావు తెలిపారు. సుమారు లక్ష మందికి పైగా స్వాములు పాల్గొంటున్న ఈ పూజా కార్యక్రమానికి భక్తులు హాజరై స్వామివారి ప్రసాదం స్వీకరించాలని కోరారు.

జిల్లా ఎస్పీని కలిసిన సీఐ సురేష్



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసిన సీఐ సురేష్

సామర్లకోట: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు సీకరించిన డి.సురేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏఎస్పీ పి.శ్రీనివాస్‌ను కూడా కలిసి మాట్లాడారు. ఇప్పటివరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన కె.దుర్గాప్రసాద్ కాకినాడ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి డి.హరిశేషు అధ్యక్షతన జరిగిన జాబ్‌మేళాను సాయిప్రసాద్ ప్రారంభించారు. 14 కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 313 మంది హాజరవ్వగా 128 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కుంచే చినబాబు, వి.చక్రం, ప్రిన్సిపాల్ చక్రవర్తి, స్కిల్ డవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులను అన్ని విధాలా ఆదుకోవాలి



మన ఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఏఎస్సై రత్నం

పెద్దాపురం: వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సామర్లకోట ట్రాఫిక్ ఏఎస్‌ఐ తాటికొండ వెంకటరత్నం అన్నారు. స్థానిక దర్గాపేట మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం ఆయన వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదన్నారు. వృద్ధులకు అండగా నిలిచి ఆదుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని చెప్పారు.

పంచాయతీ చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య


బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గ్రామ పంచాయతీ చట్టాలపై కార్యదర్శులు, ఈవోపీఆర్డీలకు పూర్తి అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య అన్నారు. స్థానిక జెడ్పీ సమావేశమందిరంలో శనివారం జిల్లాలోని ఈవో పీఆర్డీలు, ఎంపిక చేసిన గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ జీవోలపైన కూడా కార్యదర్శులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. అనంతరం డీపీఓ గ్రామ పంచాయతీ చట్టాలపై ఓరియంటేషన్ నిర్వహించారు. జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి గ్రామ పంచాయతీ సమావేశాల నిర్వహణపై అవగాహన కల్పించారు. పెద్దాపురం డీఎల్‌పీఓ బాలామణి, కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి జిల్లాలోని వివిధ మండల ఈవో పీఆర్డీలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష

పెద్దాపురం: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు ఒక్కరోజు నిరసన దీక్షను చేపట్టారు. సత్వరమే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే నెల 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రావతి అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, బాలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన వేదికలు.. గ్రంథాలయాలు

- ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు
- పుస్తక పఠనంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచే యత్నం



పెద్దాపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

పెద్దాపురం: ఉత్తమ ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితమవుతున్నారు. దీంతో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదివే తీరిక వారికి ఉండడం లేదు. ఈ నేపథ్యంలో గ్రంథాలయాలను పరిచయం చేసి అందులో ఉండే విలువైన పుస్తకాలను చదివించే దిశగా గ్రంథాలయ సంస్థ కృషి చేస్తోంది. అధికారులు పాఠశాలలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పుస్తక హుండీలను ఏర్పాటు చేసి పుస్తకాలను సేకరిస్తున్నారు. ఐదు రోజుల కిందట ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు రోజూ వివిధ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలతో పాటు గ్రంథాలయాల ప్రాముఖ్యత తెలిసేలా ప్రముఖులతో ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచే యత్నం

నియోజకవర్గంలో పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లోని శాఖా గ్రంథాలయాలతో పాటు సామర్లకోట మండలంలోని వేట్లపాలెం, ఉండూరు, పెద్దాపురం మండలం కట్టమూరు, కాండ్రకోట గ్రామాల్లో గ్రామీణ గ్రంథాలయాలు నడుస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీల నిమిత్తం విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శిస్తున్నారు. పుస్తక ప్రదర్శనల ద్వారా అందులో ఉండే విలువైన పుస్తకాల విలువను తెలుసుకుంటున్నారు. అదే సమయంలో ప్రముఖుల జీవితాలను అధ్యయనం చేయడం ద్వారా వారి స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగవచ్చని విద్యార్థులకు ఉద్బోధిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు ఆయా పుస్తకాలు చదవడంపై ఆసక్తి కనపరుస్తున్నారు. గ్రంథాలయాల్లో ఉండే చిన్ని కథలు, హాస్యం, సైన్సుకు సంబంధించిన పుస్తకాలను పుస్తక ప్రదర్శనలో ఉంచుతున్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు



గ్రంథాలయానికి వెళ్లడం వల్ల విజ్ఞానానికి సంబంధించిన చాలా విషయాలు తెలిశాయి. రోజూ గంట పాటు గ్రంథాలయంలో గడిపితే ప్రముఖుల జీవితచరిత్రలు చదివి విలువైన పాఠాలు నేర్చుకోవొచ్చు. నాకు కొత్త కొత్త పుస్తకాలను చదవాలన్న ఆసక్తి కలిగింది.

– జి.సుమ హాసిని, 9వ తరగతి విద్యార్థిని

పెరిగిన విద్యార్థుల సంఖ్య



గ్రంథాలయానికి వచ్చే విద్యార్థుల సంఖ్య గతం కంటే పెరిగింది. మరింత మంది పాఠకులను పెంచేందుకు ఈ వారోత్సవాలు దోహదపడుతున్నాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడంతో పాటు పుస్తక హుండీ ప్రాధాన్యాన్ని దాతలకు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పాలంకి నాగరాజు, గ్రంథాలయాధికారి, పెద్దాపురం

పారిశుధ్య పనుల పరిశీలన



పంచారామ క్షేత్రం వద్ద వైద్య శిబిరాన్ని పరిశీలించిన కమిషనర్ రామారావు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం వద్ద మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శనివారం పరిశీలించారు. ఆలయం వద్ద కార్తిక మాసంను పురస్కరించుకుని జరుగుతున్న ఉత్సవాలకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచారామ క్షేత్ర పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తున్న పనులను కమిషనర్ పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్ద అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యుడు యండమూరి వెంకట్రావు, ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, శానిటరీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆవంత్సను ఆదర్శంగా తీసుకోవాలి

- జీవీఆర్ కళాశాల అధ్యాపకుడు కట్టా
- సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా శత జయంత్యుత్సవాలు



సోమసుందర్ మెమెంటోను ఆవిష్కరిస్తున్న సహృదయ మిత్ర మండలి సభ్యులు

పిఠాపురం: కవిత్వంతో నిజాం ప్రభువులపై దండయాత్ర చేసి ప్రజలను చైతన్య వంతులను చేసిన ఆవంత్స సోమసుందర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉత్తమ పౌరులుగా మారాలని అనపర్తి జీవీఆర్ కళాశాల అధ్యాపకులు కట్టా కృష్ణారావు అన్నారు. పిఠాపురంలో శనివారం స్థానిక సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో ఆవంత్స శత జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సాహితీవేత్తలు మాట్లాడుతూ సమరంలో పాల్గొని ఎన్నో సార్లు సోమసుందర్ జైలు జీవితాన్ని గడిపారన్నారు. నిజాం ప్రభువుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడడంతో పాటు వజ్రాయుధం వంటి రచనలతో ప్రజలను జాగృతం చేశారన్నారు. 120 రచనలు చేసిన సోమసుందర్ ట్రస్టు ఏర్పాటు చేసి తన యావదాస్తిని ఆ ట్రస్టుకు ధారాదత్తం చేశారన్నారు. చివరకు తన పార్థివ దేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి దానం చేసిన మహా మనిషి అని వారు కొనియాడారు. ఆయన జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు వక్తలు బహుమతులు ప్రదానం చేశారు. సహృదయ మిత్ర మండలి సభ్యులు చిన్నారి సతీష్, పోతుల శ్రీనివాస్, గంగా పావని, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, గట్టి కృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తుల పూజలందుకుంటున్న తిరుపతి శృంగార వల్లభస్వామి



స్వామి వారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు పది వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామివారికి రూ.4,11,912 ఆదాయం సమకూరినట్లు ఈఓ నారాయణమూర్తి తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చిన దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘన వరమ్ము పీఠికాపురమ్ము వచ్చే నెలలో ఆవిష్కరణ



లింగం శ్రీనివాస్

పిఠాపురం: పిఠాపురం ఆధ్యాత్మిక విశేషాల ప్రాముఖ్యతను వివరిస్తూ తాను రచించిన ఘన వరమ్ము పీఠికాపురమ్ము అనే శతకాన్ని వచ్చే నెలలో ఆవిష్కరిస్తున్నట్లు ప్రవాస భారతీయుడైన పిఠాపురం వాసి, కవి లింగం శ్రీనివాస్ తెలిపారు. వృత్తి రీత్యా దుబాయ్‌లో స్థిరపడిన తాను ఆస్ట్రేలియాకు చెందిన తటవర్తి కల్యాణ చక్రవర్తి దగ్గర మూడేళ్ల పాటు తెలుగులో ఛందోబద్ధంగా పద్యాలు రాయడంలో శిక్షణ పొందినట్లు తెలిపారు. హనుమ, రుద్రా అనే రెండు శతకాలను రాసి పండితుల ప్రశంసలు అందుకున్నానన్నారు. సొంత ఊరిపై మమకారంతో పిఠాపురం పుణ్య క్షేత్రాల విశేషాలతో ప్రముఖ ప్రదేశాలు, పీఠికాపురం సంస్థానాన్ని పరిపాలించిన రావు వంశీకులు, రాజారావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పాలన, కవులు, తదితర అంశాలతో శతకాన్ని రచించినట్లు ఆయన తెలిపారు. ఈ శతకాన్ని వచ్చే నెల జూమ్ ద్వారా పిఠాపురం మహారాజా కుమారుడు రాజా రావు వేంకట కుమార మహీపతి రామ రత్నారావు, డాక్టర్ వెంకట్రావురెడ్డి ద్వారా ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా రబీ సాగు

ఏడీఏ స్వాతి



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ స్వాతి

పిఠాపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో జాగ్రత్తలు పాటించి సాగునీటి ఎద్దడి రాకుండా సహకరించాలని, ప్రణాళికాబద్ధంగా రబీ సాగు చేయాలని ఏడీఏ పి.స్వాతి విజ్ఞప్తి చేశారు. జల్లూరులో కలెక్టర్ ఆదేశాల మేరకు రబీ సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతు ఏలేరు ప్రాజెక్టు, పీబీసీలలో నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున నియోజకవర్గంలో వాటి ఆయకట్టు భూములకు సాగునీటి ఇబ్బంది ఉంటుందని, రైతులు ప్రణాళికాబద్ధంగా పంటలు సాగు చేయాలన్నారు. స్వల్ప కాలిక రకాలైన ఎంటీయూ 1123, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలతో పాటు ప్రైవేటు రకాలైన ఎంటీయూ 3626 బొండాల వంటి రకాలు వేసుకోవాలని ఆమె సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబర్ ఐదో తేదీలోపు నారుమళ్లు, నాట్లు వేయడం వంద శాతం పూర్తి చేసుకోవాలని సూచించారు. మెరక పొలాలు ఉంటే వాటిలో వరికి బదులు వాణిజ్య పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ శాఖాధికారి అచ్యుతరావు, సర్పంచ్ గుత్తుల నూకరాజు, తుమ్మల శ్రీనివాసరావు, విశ్వనాథుల వరలక్ష్మీరావు, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

భావి తరాలకు సనాతన ధర్మాన్ని అందించాలి



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పిఠాపురం: సనాతన ధర్మాన్ని కాపాడుకుంటూ భావి తరాలకు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం పాలక మండలి చైర్మన్ రెడ్డెం జనార్దనరావు అన్నారు. సనాతన ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా శనివారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గంలో పలు గ్రామాల్లో వారం రోజుల పాటు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో భక్తిభావం పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేసారు. ఆలయ ఈఓ ఆర్.సౌజన్య పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



ఆవాస్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. శనివారం సాయంత్రం మేరీ ఇమాక్యులేట్ స్కూల్‌లో జరిగిన ఆవాస్ ప్రణాళిక డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించడానికి భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన చట్టాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పి.పుల్లయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేరీ సోనియా సేవలు అభినందనీయం



శిక్షణ పూర్తి చేసుకున్నవారికి కుట్టు మెషీన్లు అందజేస్తున్న దవులూరి సుబ్బారావు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది మడికి మేరీ సోనియా సేవలు అభినందనీయమని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు అన్నారు. శనివారం బ్రౌన్‌పేటలోని లివింగ్ డీడ్స్ సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుట్టు శిక్షణతో పాటు జిల్లాలోని 100 మందికి ఉచితంగా కుట్టు మెషీన్లు అందించడం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్నవారికి కుట్టు మెషీన్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంరెడ్డి ఆనంద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోజెస్, మడికి విజయకుమార్, దొమ్మేటి రాజాసతీష్, కాకిలేటి ఆనీ సుప్రీతి, సొసైటీ డైరెక్టర్ నాగనబోయిన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



సామర్లకోట రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే పాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా చేసి కేంద్ర ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రైల్వేలో అనేక విభాగాలను ప్రైవేటీకరణ చేస్తూ రైల్వేను పారిశ్రామిక వేత్తల చేతిలో పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ మేరకు రైల్వే మేనేజర్ ఎం.రమేష్‌ను కలిసి వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలం శ్రీనివాస్, కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, బత్తుల బాలాజీ, పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: ప్రకృతి వ్యవసాయంపై జిల్లా మహిళా సమాఖ్య, మండల, గ్రామ సమాఖ్య సభ్యులు అవగాహన పెంచుకోవాలని సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ అన్నారు. శనివారం స్థానిక టీటీడీసీలో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవడం ద్వారా గ్రామాల్లోని రైతులను చైతన్యం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సెర్ప్ అధికారులు రాజశేఖర్, విజయ్‌కుమార్‌లు జూమ్ శిక్షణలో పాల్గొన్నారు. స్థానిక టీటీడీసీలో వైఎస్సార్ క్రాంతి పథం డీపీఎంలు బాబురావు, రాయ్, జిల్లా మహిళా సమాఖ్య మేనేజర్ రాజకుమారి, ఏపీఎం ఎస్.వేదకుమారిలు పాల్గొన్నారు.

నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి



వాకతిప్పలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి రాజు

కొత్తపల్లి: నాడు–నేడులో భాగంగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్టు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్జేడీ రాజు అన్నారు. మండలంలోని వాకతిప్ప జెడ్పీ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను శనివారం ఆయన పరిశీలించారు. పాఠశాలను సందర్శించి 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలి



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



ఉప్పాడలో బొమ్మలు గీస్తున్న చిన్నారులు



పోటీల్లో పాటలు పాడుతున్న విద్యార్థిని

సామర్లకోట: విద్యార్థులు చిన్ననాటి నుంచి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వకృత్వ, క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్విజ్ మాస్టర్లుగా జి.గోవిందు, కె.శ్రీనివాస్, ఎ.శ్రీవల్లి, వి.రాజు, కేవీవీ సత్యనారాయణలు వ్యవహరించారు.

గ్రంథాలయంలో వకృత్వ పోటీలు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వకృత్వ పోటీలను నిర్వహించారు. మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు పోటీలను ప్రారంభించారు. గ్రంథాలయంలో 23 వేల పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి బందిల రత్నమణి కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.రాజు, టీవీ సత్యనారాయణ, ఎండీవీ ప్రసాద్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



పెద్దాపురం గ్రంథాలయంలో జరుగుతున్న వ్యాసరచన పోటీలు

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు

పెద్దాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. లూథరన్, జేఎన్, బాలికోన్నత, సాగర్, వీర్రాజు హైస్కూల్ విద్యార్థులతో పాటు మహారాణి కళాశాల విద్యార్థులు ఆయా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, హెచ్ఎంలు కే.శ్రీదేవి, ఎంఎల్ శివజ్యోతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తకాలపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ నళినీ ప్రియ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవడం వల్ల జ్ఞానం, విజ్ఞానం పెరుగుతాయన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు

పిఠాపురం: స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు గేయాలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల సంస్కృత ఉపాధ్యాయుడు పీఎస్ రామచంద్రరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా, కేవీ సత్యనారాయణ, సత్యప్రియ, గ్రంథాలయ అధికారి ఆర్.వెంకటరాము తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



సామర్లకోట: పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన అందరినీ ఆకట్టుకుంది. ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపం వెలిగించారు. లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. లక్షపత్రి పూజలు చేసిన వారు, భక్తులు జ్యోతిర్లింగార్చనలో దీపాలు వెలిగించారు.

కూర్మం కాదు.. కందే!



పిఠాపురం: ఈ చిత్రం చూసారా అచ్చం తాబేలులా కనిపిస్తోంది కదూ. కాదండీ ఇది కంద దుంప. కొత్తపల్లి మండలం యండపల్లికి చెందిన రైతు గంధ్ర అంబయ్య పొలంలో వేసిన కంద దుంప అచ్చం తాబేలులా ఉండడంతో స్థానికులు ఆశ్చర్యంగా చూస్తున్నారు.